# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vnteluguedaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 99 | ఆదివారం 15 జూన్ 2025 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## ఎన్నికలకు ముందే
# "రైతు భరోసా



**రైతులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్..**

**తెలంగాణంలో రైతు భరోసా నిధులు చెల్లింపులకు సమయం ఆసన్నమైంది.**

**ఈ నేపథ్యంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది**

**వానాకాలం సాగు ప్రారంభానికి ముందు రైతులకు పెట్టుబడి సాయంగా 'రైతు భరోసా' నిధులు విడుదల**

**ఇప్పటికే ఆర్థిక వనరుల సమీకరణపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, వచ్చే 10 నుంచి 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం**

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రభుత్వ పథకాలలో రైతు భరోసా కూడా ఒకటి. ఈ పథకాన్ని గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో అమల్లోకి తీసుకురాగా.. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో దీన్ని కొనసాగిస్తుంది. దేశానికి వెన్నముక్క వంటి రైతులు పంటలు పండించేందుకు పెట్టుబడి సాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందుతుంది. ఈ మొత్తం ఖరీఫ్, రబీ సీజన్లకు గాను ఒక్కో విడతలో రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయబడుతుంది. అయితే తాజాగా వర్షాకాల పంటలు ప్రారంభం కావడంతో మరోసారి రైతు భరోసా నిధులు ప్రజల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం దీనిపైనే ఫోకస్ పెట్టింది. త్వరలోనే ప్రజల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసేందుకు కసరత్తు చేస్తోంది. తెలంగాణంలో రైతు భరోసా నిధులు చెల్లింపులకు సమయం ఆసన్నం కావడంతో నిధులు సమకూర్చడంపై తెలంగాణ ఆర్థిక శాఖ సమీకరణపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకుంది. శుక్రవారం మరో రూ.4 వేల కోట్ల రుణం కోసం అభ్యర్థన పెట్టింది. మొత్తం రూ.7 వేల కోట్ల నిధులు వానాకాలం రైతు భరోసా కోసం వినియోగించే యోచనలో ఉంది. ఈ మొత్తం జూన్ 17 నాటికి రాష్ట్ర ఖజానాకు చేరే అవకాశం ఉంది. 2023-24 యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట 1.52 కోట్ల ఎకరాలకు రూ.7,625 కోట్లు పంపిణీ చేసింది. అయితే గత వానాకాలం సీజన్‌లో - మిగతా3లో



## జీ-7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని

- సైప్రస్, కెనడా క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారు
- కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడి
- దాదాపు రెండు దశాబ్దాల తరువాత అక్కడ పర్యటించనున్న మోదీనే



## నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్..

- ప్రమాదానికి ముందు పైలెట్ చివరి మాటలు ఇవే..
- 'విమానంలో పవర్ లేదు. నో థ్రస్ట్.
- థ్రస్ట్ అంటే విమానాన్ని ముందుకు నడిపే శక్తి
- ఇది విమానం ఇంజిన్‌లు లేదా ప్రొపెల్లర్‌ల ద్వారా ఉత్పత్తి అవుతుంది



## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

- ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారుల వెల్లడి
- బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ సమాచారం
- ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్



## హరీశ్‌రావు వాదనలు నిరాధారం

- తప్పుదారి పట్టించేలా ఉన్నాయి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్లక్ష్యాత్మకంగా వ్యవహరిస్తున్నాం
- జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను.
- నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సే.

## అలాంటి వారిని పదవులు వెతుక్కుంటూ వస్తాయ్!

**ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి ఆసక్తికర వ్యాఖ్యలు**

**తెలంగాణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ**

**స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, పార్టీ బలోపేతం కోసం క్రియాశీల కార్యకర్తలకు పదవులు ఇస్తామని హామీ**

**సామాజిక న్యాయంతో కూడిన పదవి పంపిణీని ప్రాధాన్యతనిస్తాం**

**రాహుల్ గాంధీ సిద్ధాంతాలను అమలు చేస్తున్నాం**



హైదరాబాద్

పార్టీ కోసం కష్టపడడండి.. పదవులు వాటంతట అవే మిమిల్ని వెతుక్కుంటూ వస్తాయని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్. డీసీసీ అధ్యక్షులతో భేటీలో పార్టీశ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థలు టార్గెట్‌గా తెలంగాణ కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. సార్వత్రిక ఎన్నికల గెలుపును స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగించేందుకు ఇప్పటి నుంచే కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులను యాక్టివేట్ చేస్తున్నారు తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్. వరుస సమీక్షలు, అసంతృప్తుల బుజ్జగింపులతో బిజీబిజీగా గడుపుతున్న మీనాక్షి గ్రౌండ్ లెవల్‌లో నేతల అభిప్రాయలను, పార్టీ పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఎప్పటికప్పుడూ జిల్లా వారిగా రివ్యూ చేస్తున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు మీనాక్షి. పార్టీ కోసం పనిచేసిన నేతలకు పదవులతో పాటు కచ్చితంగా పార్టీ గుర్తిస్తోందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని కాపాడుతూనే.. పార్టీలో, ప్రభుత్వంలో పదవుల పంపిణీ - మిగతా3లో

## బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

- తెలంగాణకు మాట.. మూట సాయం కూడా లేదు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు
- కటీఆర్‌కు ఎలా నోటీసులు ఇవ్వాలనే ఆలోచనతోనే రేవంత్ సర్కార్ పనిచేస్తోంది



హైదరాబాద్

తెలంగాణకు మాట సాయం, మూట సాయం కూడా కేంద్రం చేయలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేటీఆర్‌కు ఎలా నోటీసులు ఇవ్వాలనే ఆలోచనతోనే రేవంత్ సర్కార్ పనిచేస్తోందంటూ దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టమన్న హరీష్‌రావు.. బనకచర్లకు సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, అపెక్స్ కమిటీ అనుమతులు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశం పెట్టడానికి ఈ ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "తెలంగాణ ప్రయోజనాలు కాపాడటంతో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడతారా?. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను ఆపాలని చూశారు.



## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'

- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక
- పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
- టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్

# విమాన ప్రమాదంలో.. ఏమాత్రం చెక్కు చెదరని 'భగవద్గీత'

అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిరిండియా విమాన దుర్ఘటన.. ఎంతో మంది కుటుంబాల్లో తీరని విషాదాలు నింపింది. ప్రమాద సమయంలో 230 ప్రయాణికులతో పాటు ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది ఉండగా.. ఒకే ఒక్క ప్రయాణికుడు సజీవంగా బయటపడి మృత్యుంజయుడయ్యాడు. విమాన ప్రయాణికులు సజీవ దహనమైపోవటంతో పాటు విమానం కూలిన భవనంలోని వాళ్ల ప్రాణాలు కోల్పోవటం.. దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే.. ఈ దుర్ఘటనలో కన్నీటి కథలు.. ఎన్నో భావోద్వేగ గాథలు వెలుగుచూస్తూ గుండెల్ని మెలిపెడుతున్నాయి. ఇలాంటి సమయంలోనే.. నెట్టింట ఓ వీడియో తెగ వైరల్ అయ్యింది. విమాన ప్రమాదం జరిగిన స్థలంలో భగవద్గీత దొరికిందని.. విమానం మొత్తం కాలిబూడిదైనా ఆ పుస్తకం మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ఉంది అంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి . అయితే.. ఇంత పెద్ద బ్లాస్ట్ జరిగి మనుషులంతా కాలి సజీవ దహనమైతే.. భగవద్గీత మాత్రం కాలిపోకుండా ఎలా ఉంది అనే కుతూహలం ఒకవైపు వ్యక్తమవుతుంటే.. మరోవైపు, అసలు ఆ భగవద్గీత ఎవరిదీ..? ఫ్లైట్‌లో ఎందుకుంది..? అని ప్రశ్నలు మొదలయ్యాయి. సాగర్ అమీన్ అనే వలంటీర్ విమాన ప్రమాదం గురైన స్థలంలో శిథిలాల తొలగింపు జరుగుతుండగా ఆ భగవద్గీతను కనిపెట్టారు. ఈలోపు.. ఆ గ్రంథం ఎవరనేదానిపై రకరకాల కథనాలు తెర మీదకు వస్తున్నాయి. ఆ భగవద్గీత జయశ్రీ పటేల్(27)కు చెందిందన్నది ఓ ప్రముఖ ఆంగ్ల వెబ్ సైట్ కథన సారాంశం.





అందులోని వివరాల ప్రకారం.. గుజరాత్ ఆరావళి జిల్లా కంభిసర్‌కు చెందిన జయశ్రీ పటేల్ శ్రీకృష్ణుడి పరమ భక్తురాలు. ఎప్పుడూ ఆమె తన వెంట కృష్ణుడి చిన్న విగ్రహం, భగవద్గీతను తీసుకెళ్తుందట. ఈ ఏడాది జనవరిలో ఆమెకు వివాహం అయ్యింది. భర్త లండన్‌లో ఉద్యోగం. దీంతో ఆమె అక్కడికి బయల్దేరింది. అలా వివాహం అయిన మొదటిసారి.. ఆమె ప్రయాణంలోనూ వాటిని తీసుకెళ్లిందని, ప్రమాదంలో మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు కన్నీళ్లతో చెప్పినట్లు ఆ ఆంగ్ల మీడియా కథనం ఇచ్చింది. మరోవైపు ఆ భగవద్గీత ఓ ఎయిర్‌హొస్టెస్‌దంటూ మరో కథనం వైరల్ అవుతోంది.

# నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం కూలిపోక ముందు కాక్‌పిట్‌లో ఏం జరిగింది అనేది మాత్రం ఇంకా పూర్తిగా బయటకు రాలేదు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం కూలిపోక ముందు కాక్‌పిట్‌లో ఏం జరిగింది అనేది మాత్రం ఇంకా పూర్తిగా బయటకు రాలేదు అయితే విమానం కూలిపోయే సమయంలో ఏటీసీతో పైలెట్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఏటీసీతో ఎయిరిండియా పైలెట్ చివరి సంభాషణ వైరల్ అవుతోంది. 'విమానంలో పవర్ లేదు. నో థ్రస్ట్. గోయింగ్ డౌన్.. మేడే.. మేడే.. మేడే..' అని పైలెట్ సుమత్ ఏటీసీకి చెప్పారు. ఈ సంభాషణ ఏటీసీలో రికార్డు అయింది. థ్రస్ట్ అంటే విమానాన్ని ముందుకు నడిపే శక్తి. ఇది విమానం ఇంజిన్‌లు లేదా ప్రొపెల్లర్‌ల ద్వారా ఉత్పత్తి అవుతుంది. థ్రస్ట్ అనే పదానికి తెలుగులో నెట్టడం అనే అర్థం కూడా ఉంది. దీంతో ఈ విమాన ప్రమాదంలో ఇంజిన్ లేదా ప్రొపెల్లర్‌ల వైఫల్యం కీలక పాత్ర పోషించినట్టు అర్థమవుతోంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. విమానం ఓ మెడికల్ కాలేజ్ మీద పడింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 274కు చేరింది. ఈ ప్రమాదంపై కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.ం



**మే డే కాల్‌కు శతాబ్దానికి పైగా చరిత్ర!**

సివిల్ ఏవియేషన్ రంగంలో మేడే అనే పదాన్ని మొదట 1920లో వాడారు. లండన్‌లోని క్రోయ్‌డన్ విమానాశ్రయంలో రేడియో ఆఫీసర్‌గా పనిచేసిన ఫ్రెడరిక్ స్టాన్లీ మాక్‌ఫోర్డ్ ఈ పదాన్ని మొదట ఉపయోగించినట్లు రికార్డుల్లో ఉంది. ఇది ఫ్రెంచ్ పదమైన మైడెర్‌కు సమానార్థకం. ఫ్రెంచ్‌లో మైడెర్ అంటే సహాయం చేయండి (హెల్ప్ మీ) అని అర్థం. 1923 నుంచి అంతర్జాతీయ రేడియో కమ్యూనికేషన్ వాడే పైలట్లు, సముద్రయానం చేసే మెరైన్ సిబ్బంది ఈ మేడే పదాన్ని వాడటం మొదలుపెట్టారు. అధికారికంగా మాత్రం సివిల్ ఏవియేషన్ రంగం 1927 నుంచి ఈ పదాన్ని స్వీకరించింది. అత్యవసర సమయాల్లో మేడేతోపాటు ఎస్‌ఓఎస్ పదాన్ని కూడా వాడుతుంటారు. కానీ, మేడే పదమే బాగా ప్రాచుర్యంలో ఉంది.

**మేడే కాల్ వస్తే..!**

ఎవరైనా పైలట్ నుంచి ఏటీసీకి మేడే కాల్ వచ్చిందంటే ఆ విమానం కూలిపోయే ప్రమాదంలో ఉందని అర్థం. వెంటనే ఏటీసీ అధికారులు అత్యవసరం కాని సేవలన్నింటినీ నిలిపేసి ఆ విమానాన్ని కాపాడేందుకు ప్రయత్నం మొదలు పెడతారు. సహాయం కోసం మేడే కాల్ ఇచ్చిన పైలట్ తన విమానం ఏ ప్రాంతంలో ఉంది? ఎంత ఎత్తులో ఉంది? ఎలాంటి ప్రమాదంలో ఉంది? విమానంలో ఎంతమంది ప్రయాణిస్తున్నారు అనే విషయాలు కూడా అందించాల్సి ఉంటుంది. దాన్ని బట్టి సహాయ చర్యలు ఎలా చేపట్టాలన్నది ఏటీసీ అధికారులు నిర్ణయిస్తారు. ఈ మేడే సిగ్నల్‌ను సాధారణంగా 121.5 మెగాహెడ్జ్, 243 మెగాహెడ్జ్‌లో పంపుతుంటారు. ఈ ఫ్రీక్వెన్సీలను ఏటీసీ అధికారులు అనుక్షణం పరిశీలిస్తుంటారు. కాగా, జూన్ 12వ తేదీ మధ్యాహ్నం లండన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలి.. పేలిపోయింది. ఘటనలో విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో పాటు జనావాసాలపై కూలి మరో 24 మంది మొత్తం 265 మంది మరణించారు. విమానంలోని ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రమాదానికి కారణాలను తెలుసుకునేందుకు ఈ కేసును ప్రత్యేక బృందం దర్యాప్తు జరుపుతోంది.

# అక్రమ వలసదారులు.. వెనక్కి తగ్గిన ట్రంప్?

అమెరికావ్యాప్తంగా అక్రమ వలసదారుల కోసం కొనసాగుతున్న తనిఖీలు.. అరెస్టులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఈ విషయంలో కోర్టు పరోక్షంగా ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించింది. అయినప్పటికీ లాస్ ఏంజెల్స్ నిరసనలతోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లు సమాచారం. అక్రమ వలసదారుల్ని గుర్తించి వెనక్కి పంపించేందుకు ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో బలవంతపు తనిఖీలు, అరెస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామంతో లాస్ ఏంజెల్స్‌లో ఉవ్వెత్తున నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి. క్రమంగా అవి మిగతా ప్రాంతాలకు విస్తరించాయి. అయితే తాజాగా.. హొటళ్లు, రెస్టారెంట్‌లు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమల్లో సోదాలను ఆపేయాలంటూ ఇమ్మిగ్రేషన్ – కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కి ఆదేశాలు వెళ్లాయి. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ ప్రముఖంగా ప్రచురించగా.. ముగ్గురు ఉన్నత అధికారులు సైతం ధృవీకరించారు. అంతకు ముందు.. ట్రంప్ గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ "వలసదారులు ఎక్కువగా పనిచేస్తున్న ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా త్వరలోనే ఓ ఉత్తర్వును జారీ చేస్తాను" అన్నారు. ఈ నేపథ్యంలో లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలోని వ్యవసాయ పరిశ్రమలు, హొటళ్లు, రెస్టరంట్‌లలో సోదాలు నిలిపివేయాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. అక్రమ వలసదారులను అరెస్టు చేసేందుకు ఐసీఈ అధికారులు గత శుక్రవారం లాస్‌ఏంజెల్స్‌లోని డౌన్‌టౌన్‌లో సోదాలు ప్రారంభించడంతో





ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. క్రమంగా దేశమంతటా విస్తరిస్తుండడంతో .. లాస్‌ఏంజెల్స్‌లో భారీస్థాయిలో నేషనల్ గార్డ్‌లను మోహరింపునకు ట్రంప్ ఆదేశించారు. దీంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో నిరసనకారులను అడ్డుకునేందుకు మరో 2వేల మంది నేషనల్ గార్డులను మోహరించాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ చర్యలను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్‌తోపాటు స్థానిక పోలీసు అధికారులు వ్యతిరేకించారు. గవిన్ దీనిపై ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. అధ్యక్షుడి ఆదేశాలు చెల్లవని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే.. ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును తొమ్మిదో యూఎస్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్ తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ నిర్ణయానికి పరోక్షంగా మద్దతు పలికింది. కోర్టు నిర్ణయంతో నేషనల్ గార్డు సిబ్బందికి అడ్డంకి తొలగిపోగా.. నిరసనకారులను ఎక్కడికక్కడ అరెస్టు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆపై ఈ నిర్ణయానికి తాత్కాలిక బ్రేక్ వేస్తూ మళ్లీ ఉత్తర్వులు జారీ చేసింది.

## జీ-7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని



**ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. సైప్రస్, కెనడా క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఆ దేశంలో జూన్ 15-16 తేదీల్లో పర్యటించనున్నారు. ఆపర్యటనలో భాగంగా సైప్రస్ అధ్యక్షుడితో ఆయన చర్చలు జరపనున్నారు. దీనితోపాటు వ్యాపారవేత్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేయనున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా పెంచుకోవడం, మధ్యధరా ప్రాంతంతో భారత్ సంబంధాల బలోపేతం, యూరోపియన్ యూనియన్‌లతో సంబంధాలను మరింత పటిష్టం చేసే విధంగా ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరగనున్నాయి. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జీ-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జీ-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ-7 దేశాలలోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలు, ముఖ్యంగా ఏఐతో అనుసంధానం, క్వాంటమ్ సంబంధిత అంశాల గురించి చర్చలు జరపనున్నారు. ప్రయాణంలో భాగంగా జూన్ 18న మోదీ ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టుకోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'



**ఇంటర్నెట్ డెస్క్:** ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌లోని అణుస్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు చేస్తోంది. తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను టెల్‌అవీవ్‌పైకి పంపిన టెహ్రాన్..ఆ తర్వాత వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ఇరాన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్ తమ దేశంపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగిస్తే.. టెహ్రాన్ తగలబడిపోతుందని హెచ్చరించారు. పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఖమేనీ తన చర్యలతో తన దేశంలోని ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని అన్నారు.

**టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్**

ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై తిరిగి దాడులు చేయడానికి తమదేశ వైమానిక దళం సిద్ధంగా ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్, ఇజ్రాయెల్ వైమానిక దళ చీఫ్ మేజర్ జనరల్ టోమర్ బార్ పరిస్థితులను అంచనా వేస్తున్నట్లు సమాచారం. కాగా టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ చేస్తున్న దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

**ఆపరేషన్ రైజింగ్ లయన్.. ఇరాన్ కీలక అధికారులు మృతి**

అమెరికా, ఫ్రాన్స్, యూకే స్థావరాలపై దాడులు చేస్తాం: ఇరాన్

తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే పశ్చిమాసియాలోని ఆయా దేశాల స్థావరాలను, నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. తమపై దాడులకు పాల్పడుతున్న టెల్‌అవీవ్‌కు వాషింగ్టన్ మద్దతునిస్తుందని ఇప్పటికే ఇరాన్ అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా అవన్నీ తప్పుడు ప్రచారాలని అగ్రరాజ్యం కొట్టిపడేసింది. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ గురువారం అర్ధరాత్రి భీకరమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు కీలక మిలిటరీ అధికారులు, అణుశాస్త్రవేత్తలు మృతి చెందారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా భారీ దాడులకు దిగింది. శుక్రవారం అర్ధరాత్రి టెల్ అవీవ్, జెరూసలెం లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లో డజన్ల కొద్దీ క్షిపణి దాడులు

# కాంగ్రెస్-బీజేపీ చీకటి ఒప్పందం..

## మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్ :** కాంగ్రెస్, బీజేపీలు చీకటి ఒప్పందం చేసుకొని బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కొట్లాడుతున్నట్లుగా నటిస్తూ.. రాష్ట్రంలో మాత్రం పరస్పరం సహకరించుకుంటున్నాయన్నారు. కాళేశ్వరం విషయంలో ఆగమేఘాలపై స్పందించిన కేంద్రం.. ఎస్ఎల్‌బీసీ ఘటన విషయంలో మౌనం వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన బీఆర్ఎస్ నేతలు దేవి ప్రసాద్, కిశోర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలను పక్కదో పట్టించేందుకే కాంగ్రెస్ పార్టీ కమీషన్లు, కేసుల పేరుతో కుట్రకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కల్పతరువులాంటి కాళేశ్వరం కూలిపోయిందని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీలాంటి విఫల ప్రాజెక్టును చేపట్టి కాంగ్రెస్ ఎనిమిది మంది ప్రాణా బలితీసుకుందని మండిపడ్డారు. ఇప్పుడు సహాయక చర్యలు నిలిపివేసి చేతులెత్తేసిందని విమర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉన్నారు. టీబీఎం డిజైన్‌కు మూడేళు పడుతుందని.. రెండేళ్లలోనే ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి ఇచ్చిన వాగ్దానాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఇటీవల ఏపీ పర్యటనలో కేంద్రమంత్రి బండి సంజయ్ తెలంగాణ కంటే పది రేట్లు ఏపీకి నిధులు ఇచ్చామని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆయన వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమేనన్నారు. తెలంగాణకు చెందిన బీజేపీ నాయకులు సైతం రేవంత్ సర్కారుకు వంతపాడుతున్నారని మండిపడ్డారు.



### సీఎంపై కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా..?



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2025 జనవరి 28న ఫార్ములా ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేలాది కోట్ల రూపాయాల ఆదాయానికి గండి పడిందని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ ఇంత వరకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కనీసం పోలీసులు ఫిర్యాదుదారునైన తనను విచారించకుండానే కేసు క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. సీఎం లేదా హోంమంత్రి మీద కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఉల్టా.. చేయని నేరానికి, ఫార్ములా వ్యవహారంలో ఒక తుఫైల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేటీఆర్‌కు నోటీసుల మీద నోటీసులు పంపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? సీఎంకు ఒక రూల్.. సామాన్యులకు మరో రూలా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

## కేటీఆర్‌పై కేసు... భగ్గుమంటున్నకేడర్




హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మరో కేసు నమోదు అయింది. సీఎంను అసభ్యకరమైన వ్యాఖ్యలతో కించపరిచారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడుతున్నారు. కాళేశ్వరం కమిషన్ ముందుకు విచారణకు ఈ నెల 11వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు బీఆర్కే భవన్‌కు వచ్చిన కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పరుషపదజాలంతో విమర్శలు చేశారు. కేసీఆర్ వెంట్రుక కూడా ఈ చిల్లరగాళ్లు పీకలేరంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరుస్తూ మాట్లాడటమే కాకుండా వివిధ వర్గాలను రెచ్చగొట్టేలా చేశారని తన ఫిర్యాదులో వెంకట్ పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వెంకట్ ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో వీడియోలను చూసిన పోలీసులు ఎఫ్ఐఆర్‌ఫైల్ చేశారు. ఈ కేసులో నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. కేసీఆర్ ఫార్ములా? ఈ కార్ రేస్ కేసులో విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి అధికారులు పిలిచి ప్రశ్నించారు. ఇప్పుడు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. సోమవారం ఉదయం 10గంటలకు ఏసీబీ ఆఫీస్‌లో విచారించనున్నారు. కేటీఆర్ ఈ కేసులో ౦1గా ఉన్నారు. మే నెలలోనే విచారణ జరగాల్సి ఉంది. కానీ అప్పుడు కేటీఆర్ విదేశాల్లో ఉన్నందున విచారణకు రావడానికి వీలుకాదని చెప్పారు. దీంతో ఇప్పుడు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఇలా కేసుల మీద కేసులు పెడుతుండటంపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. కక్ష సాధింపులకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రశ్నించే గొంతుకలను ఇలా తొక్కిపెట్టాలని చూస్తోందని విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో శ్రేణులపై కేసులు పెట్టి హింసించిన ప్రభుత్వం ఇప్పుడు అగ్రనాయకులను టార్గెట్ చేస్తోందని ఆరోపిస్తున్నారు నేతలు.

# 16న ఇంటర్ రిజల్ట్స్

**హైదరాబాద్ :** లంగాణలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 29వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి ఏకంగా 4.2 లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకావడంతో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇంటర్ పరీక్షల్లో తప్పిన కొందరు విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైతే.. మరికొందరేమో మార్కులను పెంచుకునేందుకు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాశారు. దీంతో ఇంటర్ సప్లిమెంటరీలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటికే ఈ పరీక్షల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఇక ఫలితాలు కూడా త్వరలోనే వెల్లడికానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల ఫలితాలకు సంబంధించి ప్రకటన జారీ చేసింది. ఇంటర్ బోర్డు తాజా ప్రకటన మేరకు జూన్ 16న సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కానున్నాయి. సోమవారం (జూన్ 16) మధ్యాహ్నం ఫలితాలను విడుదల చేయాలని నిర్ణయించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెల్లడైన తర్వాత అధికారిక వెబ్‌సైట్‌తో పాటు టీవీ9 తెలుగు వెబ్‌సైట్‌లోనూ చెక్ చేసుకోవచ్చు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి మే 29 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 4.2లక్షల విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 892 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు నిర్వహించారు. మే 29 నుంచి మొదటి విడత మూల్యాంకనం, మే 31 నుంచి రెండో విడత మూల్యాంకనం.. చేపట్టారు. జోసా కౌన్సెలింగ్, ఈఏపీసెట్, నీట్ వంటి ప్రవేశాలకు ఇంటర్ మార్కులు కీలకం




కానుండటంతో విద్యార్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఫలితాలు చూసిన తర్వాత మార్క్‌షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం మర్చిపోవద్దు. ఒరిజినల్ మార్క్ షీట్ వచ్చే వరకు ఇదే మీకు అన్నింటికీ యూజ్ అవుతుంది. డిగ్రీలో చేరాలన్నా, లేదా ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా ఇదే ముఖ్యం. అందుకే మార్క్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసి పెట్టుకొని ఒకట్రెండు ప్రింట్‌లు కూడా తీసి పెట్టుకోండి. గత ఏప్రిల్‌లో రెగ్యులర్‌గా ఇంటర్ ఫలితాలను అధికారులు విడుదల చేశారు. అందులో ఉత్తీర్ణత సాధించలేకపోయిన వాళ్లకు మళ్లీ ఫీజు తీసుకొని మే 22 నుంచి 30 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదున్నర వరకు రెండు షిఫ్టుల్లో చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్టులో, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఈ పరీక్షలు చేపట్టారు. సప్లిమెంటరీలో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఏం చేయాలి? సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా ఉత్తీర్ణత సాధించలేని వాళ్లు మరో ఏడాది ఎదురు చూడక తప్పదు. బాగా రాశాం అనే నమ్మకం ఉన్న వాళ్లు ఫీజు చెల్లించి రీవాల్యుయేషన్‌కు లేదా రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. రీవాల్యుయేషన్‌కు ఆరు వందల రూపాయలు, రీ కౌటింగ్‌కు వందల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 20 నుంచి జూన్ 25వరకు ఇలా దరఖాస్తు చేసుకోవచ్చు. బిబఎతివ.ఇఊణఊ.ఊనీల.తిని వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేయవచ్చు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త వేదకను ఏర్పాటు చేసింది. టీఎస్ ఎడ్యుకేషన్ హబ్ పేరుతో కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. ఇక్కడ రిజల్ట్స్, సిలబస్, మోడల్ పేపర్లు ఇలా చాలా అంశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. అంటే ఓ విధంగా ఆన్‌లైన్ లెర్నింగ్‌కు ఎంతగానో ఉపయోగపడనుంది. దీన్ని రేపటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు.

## ఎమ్మెల్యే పై స్థానికుల దాడి..

**హైదరాబాద్ :** భారీ వర్షాలు కురుస్తున్నాయని నాలా పరిశీలించేందుకు వెళ్లిన ఎమ్మెల్యేకు చేదు అనుభవం ఎదురైంది. నాలా వద్దకు వెళ్లిన ఎంఐఎం ఎమ్మెల్యే, ఆయన అనుచరులపై స్థానికులు తిరగబడ్డారు. నాలా సమస్యను పరిష్కరించాలని ముందు కోరిన స్థానికులు, ఆపై నిలదీసి దాడికి పాల్పడ్డారు. యాకుత్‌పుర పరిధిలో నాలా సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని యాకుత్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను స్థానికులు నిలదీశారు. వానాకాలం వచ్చినా కూడా నాలా పనులు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను స్థానికులు నిలదీశారు. ఆయన అనుచరులు స్థానికులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారి మధ్య వాగ్వాదం గొడవకు దారితీసింది. ఎమ్మెల్యే, ఆయన అనుచరులపై స్థానికులు దాడి చేశారు. తమ సమస్య పరిష్కరించాలని కోరితే పట్టించుకోకుండా తమనే దబాయించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## హరీశ్‌రావు వాదనలు నిరాధారం..



**హైదరాబాద్:** ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సే. కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ..రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారు" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు.

## అలాంటి వారిని పదవులు వెతుక్కుంటూ వస్తాయ్!

-మొదటిపేజీ తరువాయి

చేస్తోందని నేతలకు చెప్పారు. రాహుల్ గాంధీ సమాజంలో ఎవరి వాటా వారికి ఇవ్వాలన్న సిద్ధాంతంతో పని చేస్తున్నారని తెలిపారు మీనాక్షి. రాహుల్ సిద్ధాంతాలను మనం తూచతప్పకుండా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని పదవుల్లో సామాజిక న్యాయాన్ని పాటించాం.. ఇకపై కూడా అలాగే కొనసాగుతాయని అన్నారు. పార్టీ కోసం క్రియాశీలకంగా, శక్తి వంచన లేకుండా పని చేసిన ప్రతీ కార్యకర్తకు, నాయకులకు పదవులు లభిస్తాయని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం.. కొత్త, పాత నేతలు అనే భేదాభిప్రాయాలు లేకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించినట్లుగానే లోకల్ బాడీ ఎన్నికల్లోనూ గెలిపించేందుకు డీసీసీ అధ్యక్షులు జిల్లాలోని నేతలందరిని కోఆర్డినేట్ చేసుకొని పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికలు ఏ క్షణం వచ్చినా.. సిద్ధంగా ఉండాలని అన్నారు.

## ఎన్నికలకు ముందే "రైతు భరోసా

-మొదటిపేజీ తరువాయి

సాయం ఇవ్వలేదు. మొన్నటి యాసంగిలో 84 లక్షల ఎకరాలకు రూ.5,058 కోట్లు మాత్రమే విడుదల చేసి, 4 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకే ఈ సహాయం పరిమితం చేసింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 1.30 కోట్ల ఎకరాల్లో సాగు జరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ సారి మొత్తం రైతులకు పెట్టుబడి సాయం అందించాలంటే సుమారు రూ.7,800 కోట్లు అవసరమని ప్రభుత్వం లెక్కలు వేసింది.

**కేబినెట్ భేటీలో నిర్ణయం..**

అయితే, ఈ నెల నాలుగో వారంలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా పంపిణీపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. అలాగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కూడా చర్చించనున్నారు. జూన్ చివర్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో దీనిపై కూడా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

**ఎన్నికల ముందు రైతుల మద్దతు దక్కించుకోవాలన్న వ్యూహం..**

2023 డిసెంబర్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి ఫిబ్రవరిలోనే స్థానిక ఎన్నికలు జరపాలని భావించింది. కానీ లోక్‌సభ ఎన్నికలు, కులగణన కారణంగా ఆలస్యమైంది. ఇప్పుడు ఎన్నికల ముందే రైతులకు నిధులు చెల్లించి, సానుకూల ప్రజాభిప్రాయం రాబట్టాలన్నది రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా రైతుల మద్దతు సమీకరించడంతోపాటు, రాజకీయంగా కూడా లాభదాయకంగా మలచుకోవాలన్న దిశగా ముందుకెళ్తోంది.

## గొల్ల కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలి

**హైదరాబాద్ :** గొల్ల కురుమలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గొల్ల కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ దాదాపు తెలంగాణ రాష్ట్రంలో గొల్ల కురుమలు 28 లక్షల జనాభా ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం మేమెంతో మాకు అంత వాటా దక్కాలన్నారు. మంత్రి పదవితో పాటు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలన్నారు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవులు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. పార్టీ అంతర్గత పదవులలో కూడ గొల్ల కురుమలకు స్థానం కల్పించాలన్నారు..

## ప్రజా సమస్యలు వినకపోతే పల్లె బాట కార్యక్రమం ఎందుకు ?

**అత్తా కోడళ్లపై తిరగబడుతున్న పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు**

**వరంగల్ :** పాలకుర్తి నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్ళినా అత్త ఝాన్సీ రెడ్డి, కోడలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలకు నిరసన సెగ తగులుతోంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం మెత్యతండా గ్రామంలో పల్లె బాట కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు. తాగునీటి సమస్య ఉందని, విద్యుత్ అంతరాయం ఉందని, ప్రభుత్వ పథకాల మంజూరులో ఆమె అనుచరులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఝాన్సీ రెడ్డిని గ్రామస్తులు నిలదీసారు. దీంతో అక్కడే ఉంటే దాడి చేసే ప్రమాదం ఉందని భయపడి సైరన్ వేసుకొని ఝాన్సీ రెడ్డి వెళ్లిపోయారు. ప్రజా సమస్యలు విననప్పుడు, ప్రజల కష్టాలపై స్పందించినప్పుడు పల్లె బాట కార్యక్రమం ఎందుకు నిర్వహించారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

## యాభై వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు

**తాండూరు :** తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మి, భర్త మ్యాతరి రాములు, మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్ల కోసం 50 వేల వరకు డబ్బులు ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని గ్రామ మాజీ సర్పంచ్ భర్త అడిగినట్టు తెలిపారు. తమ ఇల్లు కూలిపోయి 18 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు గ్రామ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లంచాలు ఇచ్చే స్తోమత తమకు లేదని తెలిపిన కూడా తమకు ఇల్లు రానట్టు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాజీ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని చంద్రమంచ గ్రామానికి చెందిన మ్యాటర్ లక్ష్మి కోరింది. తమకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను వేడుకుంటుంది

## రాజీతో కేసుల పరిష్కారం

**చేవెళ్ల :** లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కేసుల పరిష్కారానికి సులువైన మార్గం లభిస్తుందని చేవెళ్ళ జూనియర్ సివిల్ - జడ్జ దశరథ రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చేవెళ్ల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. పెండింగ్లో ఉన్న పలు కేసులు ఇరువురి రాజీతో పరిష్కరించబడ్డాయి. చేవెళ్ళ జూనియర్ సివిల్ జడ్జ దశరథ రామయ్య, జడ్జ శ్యామ్ కుమార్, రిటైర్డ్ జడ్జ లక్ష్మణ్ మాట్లాడుతూ... లోక్ అదాలత్తో విలువైన కోర్టు సమయం వృథా కాకుండా ఇరు వర్గాల వారు రాజీ పడడంతో సులువుగా కేసుల పరిష్కారం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్షణికావేశంలో చేసిన తప్పులను తిరిగి పునరావృతం కాకుండా చూడాలని, కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సివిల్ జడ్జ శ్యామ్ కుమార్, రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్, చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు చేవెళ్ళ సీఐ భూపాల్ శ్రీధర్ రెడ్డి ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ చంద్రనాయక్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో షేర్ చేసినా చర్యలు తప్పవు

### చైల్డ్ పోర్న్ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరి అరెస్ట్.. ఇచ్చోడ సీఐ బండారి రాజు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో షేర్ చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవు అని ఇచ్చోడ సీఐ బండారి రాజు హెచ్చరించారు. చైల్డ్ పోర్న్ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నేడు సెల్ఫోన్ వాడకం ఇంటర్నెట్ వాడకం పెరిగిపోయిన సందర్భంగా యువకులు మంచి మార్గంలో కాకుండా చెడు మార్గంలో పయనిస్తూ చైల్డ్ పోర్న్ వీడియోలను ఇతరులకు పంపిస్తూ పాశాచిక ఆనందాన్ని పొందుతున్నారు అని సీఐ అన్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం లేదా గూగుల్లో వాటి కోసం వెతకడం చర్యలను జిల్లా పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీ నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినమైన పోక్సో కేసులు చేయబడతాయని హెచ్చరించారు. చైల్డ్ పోర్న్ వీడియోలను చూసి, సోషల్ మీడియాలో షేర్ చేసిన వ్యక్తిపై ఇచ్చోడ, నేరడిగొండ పోలీస్ స్టేషన్ లలో రెండు కేసులు



నమోదు చేయడం జరిగిందన్నారు. ఈనెల 13 వ తారీకున ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు ఒక వ్యక్తి నిందితుడు ఠాకూర్ సూర్య సింగ్, అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించడం జరిగిందని, అదేవిధంగా నేరేడుగొండ పోలీస్ స్టేషన్ నందు కుమారి గ్రామానికి చెందిన పోతగంటి రాకేష్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందని తెలిపారు. పిల్లల పై జరుగు అత్యాచార వీడియోలను సోషల్ మీడియా నందు అప్లోడ్ చేసిన కారణంగా అతనిపై హైదరాబాద్ చైల్డ్ టిప్ లైన్ వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఇటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సిఐ అన్నారు. యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి ఇటువంటి తప్పుదోవ పట్టించే విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిఘా ఉంచాలని, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే

# స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

**హైదరాబాద్ :** తెలంగాణ జాగృతిలో విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున చేరారు. వారికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలి. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలి. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని అన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోము. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. సీఎం ఈ



ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫోటో విడుదల చేసింది . ఆ ఫోటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారు కానీ రేవంత్ రెడ్డి మాత్రం లేరని అన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతోంది. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారు. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారు. చేస్తున్న జాబ్ లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారు. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండే నని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. దాదాపు 8 వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంటు బకాయిలు ఉన్నాయని అన్నారు. తక్షణమే ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోంది. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని అన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి

**మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్**

**హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం. అవి అసెంబ్లీ అయినా కావొచ్చు, పార్లమెంట్ అయినా కావొచ్చు, స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికలైనా కావొచ్చు. ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలని భువనగిరి మాజీ ఎంపి డా బూర నర్సయ్య గౌడ్ అన్నారు. కాని..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడిచినా, ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో 12,769 మంది సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,717 మంది ఎంపీటీసీల పదవీకాలం 2024 మే నెలలో ముగిసింది. ఇప్పటికీ ఈ స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. 538 మంది జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్ పర్సన్ల పదవీకాలం కూడా పూర్తయ్యి సంవత్సరం దాటిపోయింది. రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలలో 128 మున్సిపాలిటీల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడిచింది. అయినా ఇప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలు అనేవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ం, 243-జ, 243-జిం పరిధిలో ఉన్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత మరియు స్టేట్ ఎలక్షన్ కమిషన్ అధీనంలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర పరిధిలో ఉన్న అంశం. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి లోకల్ బాడీలకు అభివృద్ధి నిధులు ప్రధానంగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా వస్తాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావలసిన రూ. 1514 కోట్లు నిధులు ఎన్నికలు జరగకపోవడం వల్ల నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది. అంతేకాక, గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి. ఇవి కూడా ఎన్నికల నిర్వహణ లేకపోవడం వల్ల విడుదల కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని,



వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఎన్నికల్లో రిజర్వేషన్ నిష్పత్తి నిర్ణయించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆ ప్రక్రియను అమలు చేస్తుంది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఎలా ఉండాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కానీ ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడంలో విఫలమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ గొప్పగా మాటలు చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు. కానీ ఆ హామీలు ఎటూ తీరకపోవడం, ఎన్నికలు జరగకపోవడం వల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను చూపిస్తున్నాయి. అందువల్ల తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి, రాష్ట్రం నష్టపోకుండా చూడాలని అన్నారు. ఆర్టికల్ 243 (జ), 243 (జి), 243 (ం) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హక్కు, బాధ్యత. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తే, రాష్ట్రంలో ఎన్నికలు జరగకపోవడం వల్ల ఆ నిధులు పూర్తిగా వినియోగం కావడం లేదు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎంత ఉండాలో నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్నది ఇంకా అమలు రూపం దాల్చలేదు. బీసీలకు రిజర్వేషన్ పెంచాలంటే 'ట్రిపుల్ టెస్ట్' ప్రకారం ? (1) కులగణన, (2) బీసీ కమిషన్, (3) డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలంప్రకటనలు చేసి, పబ్లిక్కు వివరాలు మాత్రం వెల్లడించలేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టాలని చూడటం తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో బీసీ కులాల గణాంకాలను ప్రచురించాలని, రిజర్వేషన్లను అమలు చేసి ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఈ పరిస్థితుల్లో, ప్రతి రోజూ ఒక మంత్రి "ఇప్పుడు జరుగుతాయి", "తొందర్లో ఉంటాయి", "సంక్రాంతికి జరుగుతాయి" వంటి ప్రకటనలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

## ఇద్దరు వడ్డీ వ్యాపారుల అరెస్ట్...

## రిమాండ్ కు తరలింపు

**ఇచ్చోడ సీఐ బండారి రాజు**

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** ఇద్దరు వడ్డీ వ్యాపారులను శనివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఇచ్చోడ సిఐ బండారి రాజు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన ఇచ్చోడ లో జ్ఞానేశ్వర్ అనే వ్యక్తి పాన్ పట్టే సురేష్, పాన్ పట్టే సుభాష్ వద్ద రవి అనే వ్యక్తి కి సంబంధించిన రూ.5 లక్షలకు ష్యూరిటీ కింద బండ్ పేపర్ ను ఇచ్చారు. తీసుకున్న తీసుకున్న డబ్బులు రూ రూ.5 లక్షలు ఇటీవలనే ముట్టిచెప్పారు. ఇంకా డబ్బులు రావాలనీ వారిద్దరు దౌర్జన్యానికి పాల్పడి తన ష్యూరిటీ, చెక్ లను తిరిగి ఇవ్వడం లేదని బాధితుడు జ్ఞానేశ్వర్, పాన్ పట్టే సురేష్, పాన్ పట్టే సుభాష్ లపై ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఇద్దరు వ్యాపారులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తూ, దౌర్జన్యాలకు పాల్పడే వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటా మని సీఐ హెచ్చరించారు.



## సక్రమంగా విధులు నిర్వహించని

## వైద్యులపై చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





జిల్లా కేంద్రంలోని రూమ్స్ ఆస్పత్రిలో సక్రమంగా విధులు నిర్వహించని వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రైమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ను ఆదేశించారు. పిడుగుపాటుకు గురి అయ్యి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ శనివారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. ఎమర్జెన్సీ వార్డు లోని మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రత పాటించక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రోగులను పరిశీలించే టైంలో వైద్యులు ఎవరెవరు ఉన్నారని ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు సమయానికి వస్తున్నారా లేదా అని అక్కడ ఉన్న సిబ్బంది ని అడగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కేసిట్ లను తెప్పించి తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జల దోపిడికి బిజెపి పూర్తి మద్దతు: హరీష్ రావు

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ జల దోపిడికి పాల్పడుతోందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎపి నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ బిజెపి నేతలు ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్ లో బనకచర్ల ప్రాజెక్టుపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎపి జల దోపిడికి బిజెపికి పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. న్యాయబద్ధంగా రెండు రాష్ట్రాలకు కేంద్రం నీళ్లు పంచాలని.. కానీ ఎపికి బిజెపి మద్దతు తెలుపుతుందని చెప్పారు.పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే నియంత్రించాల్సిన కేంద్రం.. నిధులిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తుందని హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రం నుండి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డికి, బండి సంజయ్.. ప్రధాన మంత్రితో మాట్లాడి ఎపి నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఎపి జల దోపిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం నిర్వహించాలన్నారు. అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి బనకచర్లను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని.. లేకపోతే, బిఆర్ఎస్ ప్రజా పోరాటానికి, న్యాయ పోరాటానికి శ్రీకారం చుడుతుందని హరీష్ రావు అన్నారు.

## ఈ ఏడాదిలో రక్తహీనత తగ్గించాలన్నదే లక్ష్యం

## రక్తహీనతపై రాష్ట్రస్థాయి శిక్షణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈ ఏడాది రక్తహీనతను(ఎనీమియా) తగ్గించాలన్న లక్ష్యంతో సంబంధిత శాఖల అధికారులతో కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలపై రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్బియస్హెచ్ దేవి అన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని హాయ్ ల్యాండ్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం నాడు నిర్వహించిన శిక్షకులకు శిక్షణా కార్యక్రమం(ఠనీ)లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలకు చెందిన అధికారులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు, డిపిహెచ్ ఎన్వోలు, ఆర్బీయస్కే పీఓలు దాదాపు 150 మంది హాజరయ్యారు. వీరినుద్దేశించి ఆమె మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు వారివారి జిల్లాల్లో కింది స్థాయి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారు నేర్చుకున్న విషయాలన్నీ కింది స్థాయి వారికి వివరంగా చెప్పి అవగాహన కలిగించాలన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com